సాక్షి
మంచిర్యాల
బుధవారం ▪ 1 ▪ జనవరి ▪ 2025



అమ్మా.. కరుణించు..

కెరమెరి మండలం ముకదంగూడ గ్రామ పంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. 8లో▶



పిక్నిక్ స్పాట్ కరువు..! 9లో▶

శ్రీరాంపూర్ ఏరియాలో కార్మిక కుటుంబాలకు ఆటవిడుపు కరువైంది. భార్య,పిల్లలతో సరదగా బయటికి వెళ్లి సంతోషంగా గడపడానికి పిక్నిక్ స్పాట్ లేకుండా పోయింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /15.0

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పైడిపెల్లి బీట్ అధికారి సస్పెన్షన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లోని పైడిపెల్లి బీట్ అధికారి తన్వీర్ పాషాను సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, శాఖ పరమైన పనుల్లో జాప్యం ప్రదర్శించిన కారణంగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. గోండుగూడ బీట్ అధికారి లాల్‌బాయి కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

ఆస్పత్రిని శుభ్రం చేసిన మందుబాబులు



శుభ్రం చేయిస్తున్న పోలీసులు

నస్పూర్: ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులచే మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి, పరిసరాలు శుభ్రం చేయించినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురిని సోమవారం మంచిర్యాల కోర్టులో హాజరుపర్చగా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని వారికి డిసెంబర్ 31 నుంచి జనవరి 2 వరకు మంచిర్యాల ఆస్పత్రిని శుభ్రం చేయించే పనులు కేటాయించాలని తీర్పునిచ్చారన్నారు. జడ్జి తీర్పు మేరకు మరో రెండు రోజులు వారిచే ఆస్పత్రిని శుభ్రం చేయిస్తామన్నారు.

కొనసాగుతున్న 'సమగ్ర' సమ్మె



దీక్షకు మద్దతు తెలుపుతున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరాన్ని మంగళవారం ఎస్టీటీ నాయకులు మధుసూదన్ రావు, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కృష్ణ, జనరల్ సెక్రెటరీ జగన్, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ.సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

పత్తి వాహనాల బారులు



కిష్టంపేటలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లు ఎదుట పత్తిలోడుతో వాహనాలు

చెన్నూర్‌రూరల్: సీసీఐ నేటి నుంచి ఐదు రోజులపాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రకటించడంతో రైతులు పత్తి విక్రయించేందుకు వాహనాలతో మిల్లుల వద్దకు వచ్చారు. చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్, ఎల్లక్కపేట, కిష్టంపేట గ్రామాల్లోని జిన్నింగ్ మిల్లుల ఎదుట చెన్నూర్, మంచిర్యాల ప్రధాన రహదారిపై మంగళవారం పత్తి లోడ్లతో వాహనాలు ఇలా బారులు తీరాయి.

2 నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఈ నెల 2 నుంచి 5వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూర్ మండలం రేపల్లెవాడ జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు అధికంగా పేరుకుపోయాయన్నారు. ఈనెల 6 నుంచి కొనుగోళ్లు పునఃప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొత్త వసంతంలోకి..2025

- నూతన సంవత్సరానికి మనల్ని మార్చుకుందాం
- పాత అలవాట్లకు స్వస్తి పలుకుదాం
- నూతన పనులకు అంకురార్పణ చేద్దాం
- ఎంబీబీఎస్ డిస్టింక్షన్‌లో పాసయ్యేందుకు ప్రణాళిక
- 'సాక్షి' డిబేట్‌లో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల మనోగతం

ఎన్నో మధుర జ్ఞాపకాలు.. కొన్ని విషాదాలు.. కొన్ని బాధాకర సంఘటనలతో 2024 కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరం 2025 తమ జీవితాల్లో ఆనందాలు, సంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నారు. ఆయురారోగ్యాలతోపాటు సిరిసంపదలు సమకూరాలని ఆశిస్తుంటారు. లక్ష మైళ్ల దూరమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభించాల్సి ఉంటుంది. అలా ప్రతీఅంశం ఆచరణలో పెడితేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి. నూతన సంవత్సరంలో తమ మనసుల్లోని కోరికలు నెరవేరాలని ఆకాంక్షించే విద్యార్థులు, యువత, మధ్య వయస్కులు అనేకులు ఉన్నారు. తమ జీవన శైలిలో, ఆలోచనలో మార్పుల కోసం తీర్మానాలకు జనవరి 1ని ముహూర్తంగా భావిస్తారు. 2025 సంవత్సరాన్ని ఆనందంగా స్వాగతించి, అనుకున్న లక్ష్యాలను నెరవేర్చేందుకు, కోటి ఆశలు, కొత్త ఊసులతో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన డిబేట్‌లో ఎంబీబీస్ విద్యార్థులు నూతన సంవత్సరానికి వెల్‌కం చెప్పారు.

మంచిర్యాలటౌన్/పాతమంచిర్యాల

ప్రణాళికతో ముందుకెళ్తాం



ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల ఎంబీబీఎస్ చదువును ప్రణాళిక ప్రకారం చదివేందుకు ఈ నూతన సంవత్సరాన్ని ఎంచుకుంటా. చదువు, ఆహారపు అలవాట్లలో పక్కా ప్రణాళిక ఉంటే విద్య, ఆరోగ్యం మన చెంత ఉంటుంది.

– మనీష్, ఎంబీబీఎస్ ఫస్టియర్, గోదావరిఖని



మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు

సమయం వృథా కాకుండా..



ఎంతో కష్టపడి చదివితే మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నాలుగేళ్ల నా చదువులో నేను సమయాన్ని వృథా చేయకుండా ప్లాన్ చేసుకుంటా. చదువులో ఏది ముఖ్యమైనదో గుర్తిస్తూ, దేనికి ఎంత సమయం కేటాయించాలో నిర్ధారించుకుంటూ ముందుకెళ్తా.

– నిఖిల్, ఎంబీబీఎస్ ఫస్టియర్, వనపర్తి

మంచి చేసేలా చూస్తా



ఎంతో కష్టపడి చదివితే ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. డాక్టర్ కోర్సును పూర్తిచేసి ఓ మంచి వైద్యురాలిగా పేరు తెచ్చుకుని, అందరికి మంచి చేసేలా చూస్తా. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైంది. దానిని పేదలకు ఉపయోగపడేందుకు నావంతుగా కృషి చేస్తా.

– ప్రణతి, ఎంబీబీఎస్ ఫస్టియర్, జనగాం

మంచి ఆరోగ్యాన్ని పొందాలి



ముందుగా మనం మంచి ఆరోగ్యాన్ని పొందితేనే చదువులోనూ, చేసే ఉద్యోగంలోనూ ఆరోగ్యకరంగా ఉండవచ్చు. జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించుకునే అవకాశం ఉంటుంది. మంచి ఆరోగ్యాన్ని పొందేందుకు కొత్త సంవత్సరం నుంచే ప్లాన్ చేసుకుంటా.

– సాయి రుతికేష్, ఎంబీబీఎస్ ఫస్టియర్, హైదరాబాద్

మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటా



ఎంబీబీఎస్ పూర్తయిన తరువాత ఒక మంచి వైద్యురాలిగా పేరు తెచ్చుకుంటా. ఇందుకోసం నూతన సంవత్సరం నుంచే ప్రణాళిక ప్రకారంగా చదువుపై దృష్టిపెడతా. పేదలకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు కృషి చేస్తా.

– సుహాని జైస్వాల్, ఎంబీబీఎస్ ఫస్టియర్, హైదరాబాద్

ఒత్తిడి లేకుండా ఉండాలి



చదువుతో పాటు కెరీర్ కోసం విద్యార్థి దశ నుంచి తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ చదువులో తమకే ఎక్కువ మార్కులు రావాలని కోరుకుంటారు. కానీ అందరికీ రావు. అందుకే ఒత్తిడి లేకుండా ఉండడం వల్ల చదువులో ఏకాగ్రత పెరుగుతుంది. దీనినే ఈ నూతన సంవత్సరం నుంచి అమలు చేసుకుని ముందుకెళ్తా.

– హాసిని, ఎంబీబీఎస్ ఫస్టియర్, మంచిర్యాల

హ్యాపీ న్యూఇయర్..!



మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో మంగళవారం న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల ముగ్గులు వేసి 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.



మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025కు ఘన స్వాగతం పలికారు. రంగురంగుల ముగ్గులు, కేకులు, మిఠాయిలు కొనుగోలు చేశారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోనూ న్యూ ఇయర్ జోష్ కనిపించింది.



భీమిని: కన్నెపల్లి మండలంలోని కార్తీక్ మహారాజ్ స్వామి భక్తులు న్యూఇయర్ వేడుకలను ప్రత్యేకంగా జరుపుకుంటారు. మూడు రోజుల ముందు పాదయాత్రగా బయలుదేరి డిసెంబర్ 31న చప్రాడ కార్తీక్ మహారాజ్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. హైందవ సంప్రదాయం ప్రకారం వేడుకలు జరుపుకుంటారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇసుక అక్రమంగా రవాణాచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది చింతపల్లి వేబ్రిడ్జి నుంచి 328 ట్రిప్పుల్లో 1,312 మెట్రిక్ టన్నుల ఇసుకను రూ.47,468కు విక్రయించడం జరిగిందన్నారు. కొల్లూర్ 3 వేబ్రిడ్జి నుంచి 78 ట్రిప్పుల్లో సుమారు 2,340 మెట్రిక్ టన్నుల ఇసుకను రూ.8,77,500లకు విక్రయించామన్నారు. ఒక ట్రిప్పులో దాదాపు 30 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటుందని, అంతకు మించి ఉన్నట్లయితే ఆన్‌లోడింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఒక కిలో ఇసుక కూడా నిబంధన మించి లోడింగ్ చేయడం జరుగలేదన్నారు. ఈ ఏడాదిలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక వాహనాలపై 4 కేసులు నమోదు చేసి రూ.2,12,360 జరిమానా విధించామన్నారు. 686 ట్రిప్పుల్లో తరలిస్తున్న 2,744 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి రూ.74,088 జరిమానా విధించామన్నారు. ఇసుక డంప్, తరలింపు వివరాల నమోదు వంటి అన్ని అంశాలు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల, చెన్నూర్ మండలం అక్కేపల్లి, నెన్నెల మండలం ఖర్జీ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల ద్వారా స్థానిక అవసరాలకు ఇసుకను వినియోగించడం జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై వివిధ కోణాలలో పత్రికలు, చానళ్లలో కథనాలు వస్తున్నాయని, ఒక్కసారి ప్రజలలోకి వెళ్లిన వార్తను తిరిగి తీసుకోలేమని, పూర్తిస్థాయిలో నిజ నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

బెటాలియన్ పోలీసులకు సేవా పతకాలు



సీహెచ్.రాజన్న, ఆర్ఎస్సై



ఎం.గోపాల్, ఏఆర్ఎస్సై



పి.సంతోష్, ఏఆర్ఎస్సై



వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఆర్ఎస్సై రాజన్న, ఏఆర్ఎస్సైలు ఎం.గోపాల్, పి.సంతోష్, హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వర్లు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.20 వేల ప్రోత్సాహకంతో పాటు సేవా పతకాలు అందుకోనున్నారు. కమాండెంట్ పి.వెంకటరాములు, బెటాలియన్ ఆర్ఐలు, ఏఆర్ఐలు, ఆర్ఎస్సైలు, పోలీస్, మినీస్టీరియల్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దు

- రామగుండం సీపీ శ్రీనివాస్



మందమర్రిలో మొక్క నాటుతున్న సీపీ శ్రీనివాస్

మందమర్రిరూరల్: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి మంగళవారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కమిషనరేట్ పరిధిలో నేరాలు అదుపులో ఉన్నాయన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేరగాళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వస్తే న్యాయం జరుగుతుందనే భావన ఫిర్యాదుదారుడికి కల్పించాలని సూచించారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ అదుపులోనే ఉందని, నిందితులు ఎవరైనా సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోశారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, ఏఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం వద్దు

బెల్లంపల్లి: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. క్రైమ్ రేటు తగ్గించడానికి మరింతగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాండూర్, మందమర్రి సీఐలు కుమారస్వామి, శశిధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

జాతీయ మహాసభలకు విరాళాల సేకరణ



విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటస్వామి

బెల్లంపల్లి: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్ఎం) జాతీయ ద్వితీయ మహాసభలకు బెల్లంపల్లిలో మంగళవారం ఆ సంఘం నాయకులు, సీపీఐ శ్రేణులు విరాళాలు సేకరించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 5, 6, 7వ తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా జాతీయ ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నిర్మాణ బాధ్యుడు దాగం మల్లేష్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రత్నం ఐలయ్య, ఏఐవైఎఫ్ నాయకులు మొగిలి లక్ష్మణ్, గోమాస మల్లేష్ పాల్గొన్నారు.

అమ్మా.. కరుణించు..

- వనక్షేత్రంలో జంగుబాయి దేవత
- నేటి నుంచి నెలపాటు జాతర
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి



పోచమ్మ ఆలయంలోని ప్రతిమలు



పవిత్ర స్నానాలు చేసే కొలను



జంగుబాయి గుహ

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలం ముకదంగూడ గ్రామపంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 28వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. నెలపాటు ఆదివాసీల ఆరాధ్యదైవం.. అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేస్తుండటంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు సౌకర్యం కల్పించారు. మహరాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్, పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లు అమర్చారు. ఆలయ వరకు సీసీ రోడ్డు వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ సంవత్సరం జంగుబాయి ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తాగునీటితో పాటు రోడ్డు, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించింది. ఇటీవల జంగుబాయి ఉత్సవాలపై హట్టిలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా పత్యేక సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎనిమిది గోత్రాలు ఒకే వేదికపై..

వివిధ రాష్ట్రాల్లో ఉన్న జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పుజారులుగా వ్యవహరిస్తారు. వనక్షేత్రంలో బస చేసిన పోచమ్మతల్లికీ మొక్కు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారు చేస్తారు. సంప్రదాయ వాయిద్యాలతో గుహలోపలికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడున్న మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతల వద్ద మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. రాత్రి భోజనాల అనంతరం సంప్రదాయ నృత్యాలు చేస్తారు.

ప్రభుత్వ గుర్తింపుతో అభివృద్ధి

ఏడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం జంగుబాయి ఉత్సవాలకు గుర్తింపునిచ్చింది. ఏటా అభివృద్ధి కోసం రూ.10 లక్షలు విడుదల చేస్తోంది. ఈ నిధులతోనే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తారు. పూజాసామగ్రికి వెచ్చిస్తారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేకమంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్లు, రప్పలు, దుమ్ము, ధూళిలోనూ కొందరు కాలినడకన వస్తే.. మరికొందరు ఎడ్ల బండిపై వస్తారు. సుమారు వెయ్యికిపైగా ఎడ్లబండ్లు రావచ్చని నిర్వాహకుల అంచనా. పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.

ఇలా వెళ్లాలి..

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలంలోని ఆనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరందోళి మీదుగా, లేదా పరంధోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుపై వెళ్లవచ్చు. నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా, ఆదిలాబాద్ నుంచి లొకారి మీదుగా కూడా జంగుబాయికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

సౌకర్యాలు కల్పించాం

జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం. ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ సిబ్బందిని నియమించాం. నెలపాటు వారు ఇక్కడే ఉండి ఆలయ ఆవరణను శుభ్రంగా ఉంచుతారు.

– అమ్జద్‌పాషా, ఎంపీడీవో

28 వరకు జాతర



బుధవారం నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 28వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ–మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీ రోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్ లైట్లు అమర్చారు.

– మరప బాజీరావు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు

గుహలోనే దేవత..

జంగుబాయి దేవత గుహలో బస చేసి ఉంది. గుహ కావడంతో అక్కడికి భక్తులు కూర్చునే వెళ్తారు. చీకట్లో వెలుగుతున్న దీపం రూపంలో అమ్మవారు దర్శనమిస్తుంది. కోరికలు తీర్చే తల్లిగా ఆదివాసీలు విశ్వసిస్తారు. పుష్యమాసం నుంచి అమావాస్య వరకు జాతర కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు నియమనిష్టలతో పాదరక్షలు లేకుండానే నడుస్తూ వస్తారు. నెలపాటు కటిక నేలపైనే పడుకుంటారు. దీపారాధనతో ప్రారంభమయ్యే ఈ జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి గుహలో వెలుగుతున్న దీపం



ముస్తాబైన అమ్మవారి ప్రాంగణం



చోరీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: ఆలయంలో చోరీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల రామాలయంలో గత జూన్ 9న చోరీ జరిగింది. పూజారి రాంశర్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు తిలక్‌నగర్‌కు చెందిన సయ్యద్ అఖార్ అలీని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబల్ ఎస్.శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు నేరస్తుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధించడంతోపాటు అప్పుగా తీసుకున్న రూ.20 లక్షలు మొత్తం చెల్లించాలని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష మంగళవా రం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ ఎల్. శ్రీనివాస్ కథనం ప్రకారం ..హాజీపూర్‌కు చెందిన మాధవరపు రాజేశ్వర్‌రావు వద్ద ఆదిలా బాద్‌కు చెందిన వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్‌నర్ సురభి కిషన్‌రావు రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పలుమార్లు అడిగిన ఇవ్వకపోవడంతో ష్యూరిటీగా రూ.10 లక్షల విలువ గల రెండు చెక్కులు ఇచ్చాడు. కిషన్‌రావు బ్యాంకు ఖాతాలో డబ్బులు లేనందున చెక్కులు బౌన్స్ అయ్యాయి. 2017లో రాజేశ్వర్‌రావు కో ర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశాడు. విచారణ అనంతరం కిషన్‌రావుకు ఏడాది జైలు శిక్ష విధించడంతోపాటు రూ.20 లక్షలు రాజేశ్వర్‌రావుకు చెల్లించాలని మెజిస్ట్రేట్ తీర్పువెలువరించారు.

విందుకు వెళ్లొస్తూ ఇద్దరు మృతి



మంద రాజు మృతదేహం



జిల్లపెల్లి పవన్ కల్యాణ్..

దండేపల్లి: డిసెంబర్ 31 సందర్భంగా విందు చేసుకుని తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రం సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లికి చెందిన జిల్లపెల్లి పవన్ కల్యాణ్(23), మంద రాజు(35)లతోపాటు మరికొందరు మిత్రులు కలిసి సమీప అటవీ ప్రాంతంలో మంగళవారం 2024కు వీడ్కోలు పలుకుతూ దావత్ చేసుకున్నారు. ఇంటికి తిరిగి వచ్చే వస్తూ కేజీబీవీ సమీపంలో కడెం ప్రధాన కాలువ వంతెన దాటే క్రమంలో పవన్‌కల్యాణ్, రాజు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్ అదుపు తప్పి కాలువలో పడిపోయింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మిగతా మిత్రులు గమనించి 108అంబులెన్స్‌లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారిద్దరు చనిపోయినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఇద్దరు మృతితో వారి కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. రాజు భార్య అనారోగ్యంతో రెండేళ్ల క్రితం చనిపోయింది. వారికి కూతురు ఉంది. పవన్‌కల్యాణ్‌కు గత నవంబర్‌లో వివాహం జరిగింది.







అనుమతి లేకుండా వెళ్లిన ఇద్దరిపై కేసు

జన్నారం: జన్నారం అటవీరేంజ్ కోర్ ఏరియా ప్రాంతంలో రాత్రివేళ అనుమతి లేకుండా రెండు వాహనాల్లో వెళ్లిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. ఆమె తె లిపిన వివరాలు.. రాత్రిసమయంలో నిబంధనలు అతిక్రమించి ఈనె ల 29న జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని గేటు నెంబర్ 1 నుంచి బైస న్‌కుంట వరకు సంతోష్, మహేందర్‌లు రెండు కార్లలో వెళ్లారు. ఇద్దరి పై కేసు నమోదు చేసి, వారి వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇటుకబట్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ఇటుక బట్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఇటుక బట్టీ కార్మిక సంఘం(ఐఆర్‌టీయూ) నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఇటుక బట్టీల యజమానులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటుక బట్టీ కార్మికులు, యజమానుల మధ్య కూలీ రేట్ల పెంపు పై ఒప్పందం కుదిరిందని తెలిపారు. వెయ్యి ఇటుకల తయారీకి కూలి రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఒప్పందం రెండేళ్లు అమలుల్లో ఉంటుందన్నారు. కూలీలకు యజమానులు కనీస వసతులు కల్పించాలని, పిల్లలు డ్రాపౌట్లు కాకుండా సమీపంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, పనిస్థలాల్లో ప్రమాదాల వైద్యఖర్చులు యజమానులు భరించాలని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు జయరావు, నైనా ల వెంకటేశ్వర్లు, లచ్చన్న, సంకే రవి, లచ్చన్న, కుర్మ సమ్మయ్య, కో యిల మారయ్య, మంచాల భీమయ్య, ఇటుక బట్టీల యజమానులు ఐలయ్య, తిరుపతి, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.









ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని బడ్‌గాం గ్రామానికి చెందిన బోస్లే పులాజీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ కథనం ప్రకారం.. బోస్లే పులాజీ (51) గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉరేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.





